బీఆర్ఎస్ సీనియర్ నేత మృతి

గజ్జెల అజయ్ (ఫైల్)

ఖైరతాబాద్, జూన్ 9: బీఆర్ఎస్ సీనియర్ నేత గజ్జెల అజయ్ అనారోగ్యంతో మృతి చెందారు. అజయ్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. రెండేండ్ల క్రితం కొవిడ్ సోకడంతో ఊపిరితిత్తులపై ప్రభావం చూపింది. దీంతో కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన అజయ్‌ను కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అజయ్ మృతిపట్ల తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

మహిళా హక్కులను పరిరక్షించుకోవాలి

హిమాయత్‌నగర్, జూన్ 9: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఫోరం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న మహిళా చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో చట్టసభల్లో మహిళలకు కల్పించాలని, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం దక్కే వరకూ మహిళలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం.. అత్యవసర వైద్య శిబిరాలకు చర్యలు

జూబ్లీహిల్స్, జూన్ 9: వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. తాగునీటిలో వర్షపు నీరు కలిసి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో అత్యవసర వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తుంది. బస్తీల్లో ఔట్ రీచ్ హెల్త్ క్యాంప్‌లు, వెక్టర్ బోర్న్ డిసీజెస్ (వీబీడీ) క్యాంప్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానల పరిధిలో ప్రస్తుతం వస్తున్న కేసులపై దృష్టి పెట్టిన అధికారులు ఆయా సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే దోమలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో పాటు సీజనల్ డిసీజెస్ నివారణకు ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వర్షాలు ఉధృతమైతే తీసుకోవాల్సిన చర్యలపై పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, జూన్ 9: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం పలువురి నృత్యకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్య గురువు శ్రీలక్ష్మీ శాంకరి శిష్య బృందం ప్రదర్శించిన పలు అంశాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో వినాక కౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, జయ జయ దుర్గే, నీలమేఘ శరీర, దశావతారం, కొలువై ఉన్నడే, ఇందేందువచ్చితివిరా, నారాయణతే నమో నమో, హిందోళ తిల్లాన, మని నూపుర ధరి, చక్కని తల్లికి అంశాలను లహరి, మనస్విని, సంజన, శరణ్య, కాజోల్, లిఖిత, శ్రీజ, కావ్య, తపస్య, సంప్రీతిలు కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

మార్కెట్‌కు వెళితే.. ఫోన్లు మాయం

ఎర్రగడ్డ రైతు బజార్ (ఫైల్)

- ఎర్రగడ్డ రైతు బజార్‌లో జేబు దొంగల బెడద
- ఆదమరిస్తే అంతే సంగతులు..
- కొనుగోలుదారుల జేబుల్లో సెల్‌ఫోన్లు మాయం

ఎర్రగడ్డ, జూన్ 9: ఎర్రగడ్డలోని మోడల్ రైతుబజార్ జేబు దొంగలకు అడ్డాగా మారింది. కొనుగోలుదార్లు ఏమాత్రం ఆదమర్చినా అంతే సంగతి. వాళ్ల జేబులో విలువైన సెల్‌ఫోన్‌తో పాటు పర్సులు మాయమౌతున్నాయి. ఇటీవల ఎర్రగడ్డ రైతు బజార్‌లో జేబు దొంగల చేతివాటం మితిమీరిందనే చెప్పాలి. నెల రోజుల వ్యవధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా.. పోలీసులకు ఫిర్యాదు చేసింది మాత్రం కేవలం నలుగురంటే నలుగురే. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగడ్డ రైతుబజార్‌లో సెల్‌ఫోన్లు, పర్సులు పోగొట్టుకున్న వాళ్లలో చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేయటం లేదు. దీంతో ఆ సంఘటనలు వెలుగులోకి రాలేదు. ఎర్రగడ్డ రైతుబజార్‌కు స్థానికులతో పాటు బోరబండ, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు నిత్యం వస్తుంటారు. దీంతో పాటు వివిధ వాహనాలపై ఆ మార్గం గుండా వెళ్లేవారు కూడా ఎర్రగడ్డ వద్ద వాహనాలను నిలిపి రైతుబజార్‌లో వివిధ వస్తువులను కొనుగోలు చేస్తారు. దీంతో ఇక్కడ రద్దీ అధికంగా ఉంటుంది. ఇదే అదనుగా జేబు దొంగలు రెచ్చిపోతున్నారు. 12 రోజుల్లో రైతుబజార్‌లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లలో ముగ్గురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి జేబు దొంగల ఆట కట్టించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆట కట్టిస్తాం: డీఐ భూపాల్‌గౌడ్

గతంలో ఎస్సార్‌నగర్ ఠాణా పరిధిలో ఉన్న ఎర్రగడ్డ రైగు బజార్ ప్రాంతం ఏడాది క్రితం నూతనంగా ఏర్పడిన బోరబండ పీఎస్ పరిధిలోకి వచ్చింది. పీఎస్ పరిధిలో సెల్‌ఫోన్ల దొంగల బెడద ఎక్కువైన విషయం వాస్తవమే. నెల రోజుల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించాం. రైతుబజార్‌తో పాటు పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జేబు దొంగల ఆట కట్టిస్తాం. చోరీకి గురైన సెల్‌ఫోన్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని బాధితులకు అందే విధంగా చేస్తాం.

నీటి వృథా.. అరికట్టేదెలా..

- సిబ్బందికి ఫోన్ చేసినా ఫలితం శూన్యం - స్పందించని సంబంధిత అధికారులు - బండ్లగూడలో వారానికి ఒక గంట మాత్రమే నీటి సరఫరా

బండ్లగూడ, జూన్ 9: జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో మంచినీరు వృథాగా పోతున్నది. అసలే భుగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి నీటి ఇబ్బందులతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు ఇదేమి పట్టనట్టుగా వ్యవరిస్తుండటంతో స్థానికులు వారి ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో మంచినీటి సంపు నిండిపోయి సుమారు మూడు గంటల పాటు వృథాగా నీరు పోయింది. దీంతో స్థానికులు చూసి జలమండలి సిబ్బందితో పాటు అధికారులకు ఫిర్యాదు చేసినా అదిగో ఇదిగో వస్తున్నాం అని చెబుతున్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వారానికి ఒకసారి మంచినీళ్లు ఇస్తుండటంతో చాలిచాలని నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు నీటిని వృథా చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి సరైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంధంగూడలో సంపు నుంచి వృథాగా పారుతున్న నీరు

బడుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

శ్రీరాంనగర్ ఉన్నత పాఠశాలలో గార్డెనింగ్ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్‌కుమార్

జూబ్లీహిల్స్, జూన్ 9: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంతో సర్కారు బడులు కొత్తరూపు సంతరించుకొంటున్నాయి. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అధికారులు పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకొంటుంది. మరో 2 రెండు రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనుండగా పనులు వేగవంతం చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఖైరతాబాద్-2 మండలంలో 17 పాఠశాలల్లో పథకంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. బడులను సుందరీకరించేందుకు గార్డెనింగ్, పెయింటింగ్, ఫర్నిచర్ పనులు చేపడుతున్నారు. మైనర్ రిపేర్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్ల మరమ్మతులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ పరిధలోని వినాయక్ నగర్ ప్రాథమిక పాఠశాలలో డ్రికింగ్ వాటర్ పనులు పూర్తయ్యాయని, ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు పూర్తయ్యాయని డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మొత్తంగా 7 పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు వంటి మౌలిక వసతులు కల్పించగా మరో 8 పాఠశాలల్లో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఖైరతాబాద్-2 మండలంలో చేపట్టనున్న 66 పనుల్లో 9 పనులు పూర్తికాగా మరో 34 పనులు పురోగతిలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.

సమాజ సేవకురాలికి సన్మానం

హిమాయత్‌నగర్, జూన్ 9: బంజారా మహిళా సొసైటీ స్థాపించి కొన్నేండ్లుగా తన కుమారుడు డాక్టర్ ఆనంద్ తోపాటు సుజాత ఇస్లావత్ పేదలకు సేవలు అందిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన పలువురు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆనంద్ మిత్రులు పూర్ణిమ, ఈసీ గోపాల్, హరిప్రియ, చైతన్య, పరిమళ, దివ్య, గీత, గోవిందు తదితరుల సహాయంతో హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, యాద్రాద్రి జిల్లాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, అనాథ పిల్లలకు భోజనం, నిత్యావసరాలు పలు సందర్భాల్లో అందజేశారు. ముఖ్యంగా కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో విశేష సేవ చేశారు. నల్గొండ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ సుజాతను సన్మానించారు.

సుజాత ఇస్లావత్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారి రాములు నాయక్, తదితరులు

ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు

గంధంగూడ ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

బండ్లగూడ, జూన్ 9: త్వరలో బడులు ప్రారంభమవుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు ప్రారంభించారు. గంధంగూడ ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతు పనులు మొదలుపెట్టారు. ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరి, స్కూల్ కమిటీ చైర్మన్ రజిత, స్థానికులు రాజశేఖర్, హరీశ్‌గౌడ్ బడిలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెరిగాయని ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. స్థానికుడు రాజశేఖర్ విద్యార్థుల కోసం మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అత్తాపూర్, జూన్ 9: అపూర్వంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనంగా జరిగింది. అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని శ్రీనికేతన్ హై స్కూల్‌లో 2004-2005వ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. 20 ఏండ్ల తరువాత అప్పటి ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు తీసుకొని అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 120 మంది పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలవడంతో ఎంతో సంతోషకరమని ఈ సందర్భంగా నెమరేసుకున్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పొదుపు సంఘాలతో ఆర్థిక వృద్ధి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 9: కలిసికట్టుగా ఉంటే ఆర్థికంగా అభివృద్ధి చెందొచ్చని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని లక్ష్మిగూడ శ్రీలక్ష్మి పొదుపు సంఘం స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం సంఘం భవనంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పొదుపు చేసుకొని జమ చేసుకుంటే వారి అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పొదుపుతో భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్‌లపై ఆధారపడకుండా అతి తక్కువ వడ్డీలకు సంఘాలలో రుణాలు తీసుకోవచ్చునారు. పొదుపు సంఘాల్లో రాష్ట్రంలోనే రాజేంద్రనగర్ 10వ స్థానంలో ఉందని తెలిపారు. సమావేశంలో పొదుపు సంఘం అధ్యక్షుడు సందమైని రఘుపతిముదిరాజ్, కార్యదర్శి డి.రమేశ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు సి.రాజుముదిరాజ్, సంయుక్త కార్యదర్శి జి.కుమార్, కార్యదర్శి ఎ.మాణిక్యంరెడ్డి, అనసూయ, డి.సికిందర్, కె.జగదీశ్, వేణుగోపాల్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు

రాజ్‌మోహల్లా సంక్షేమ సంఘం ఎన్నిక

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

హిమాయత్‌నగర్, జూన్ 9: రాజ్‌మోహల్లా సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా డి.వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిరిల్ జేమ్స్, ఉపాధ్యక్షులు ఆర్.అరుణ్‌కుమార్, పి.దామోదర్, ఇ.ప్రభుదాస్, పి.మాణిక్యమ్మ, సహాయ కార్యదర్శులు బి.నర్సింగ్‌రావు, ఎంవీ రామకృష్ణ, పి.శివకుమార్, సహాయ కార్యదర్శి కె.మంజుల, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జి.రామ్‌మోహన్, ఎస్.క్రాంతి, కె.శ్రీశైలం, కోశాధికారి ఎ.శేషగిరిరావు, సహాయ కార్యదర్శి టి.కమల్‌నాథ్, సలహాదారులు జి.జానకిరాం, పి.గౌతమ్ రాజు ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా పనులు

రహ్మత్‌నగర్ డివిజన్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, జూన్ 9: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. ఆదివారం హనుమాన్ టెంపుల్, చర్చి గల్లీల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన సీవరేజీ, రోడ్డు పనులపై స్థానికులతో చర్చించారు. హనుమాన్ టెంపుల్ నుంచి బంగారు మైసమ్మ ఆలయం వరకు మధ్యలో నిర్మించాల్సిన రోడ్డు పనుల విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మాన్‌సూన్ ప్రారంభమైనందున ప్రజలకు సౌకర్యాలు మెరుగుపర్చేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు నాలాలు, డ్రైన్‌లు, మ్యాన్‌హోళ్ల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

- పదేపదే వ్యర్థాలు వేసే వారికి రూ.10 వేల వరకు జరిమానా
- బ్యానర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న అధికారులు

యూసుఫ్‌గూడలో 'రోడ్డుపై చెత్త వేస్తే రూ.10 జరిమానా..' బ్యానర్‌తో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జూబ్లీహిల్స్, జూన్ 9: ఎంత చెప్పినా వినకుండా రోడ్లపై పదేపదే చెత్త వేస్తే జీహెచ్ఎంసీ రూ.10వేల వరకు జరిమానా విధించనుంది. గతంలో డంపర్ బిన్లు తొలగించి గార్బేజ్ వన రబుల్ పాయింట్ల (జీవీపీ)లను నగర పాలక సంస్థ ఏర్పాటు చేసింది. ఇప్పుడు వాటిని కూడా సమూలంగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా స్వచ్ఛ ఆటోల వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. జీవీపీల వద్ద పొదుపు సంఘాలు నిఘా పెంచడంతో పాటు బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే చర్యలు తీసుకుంటామని ఏఎంఓహెచ్ డాక్టర్ కవిత హెచ్చరించారు. ప్రతి ఇంటి యజమాని చెత్తను స్వచ్ఛ ఆటోకే ఇవ్వాలని.. రోడ్లపై వేస్తే జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. ఆదివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీవీపీతలు తొలగించిన ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేసే పనులను పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేసే వారికి రూ.1 వెయ్యి నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ఇంటి వద్దకు వచ్చే ఆటోకు చెత్త ఇవ్వడమా.. రోడ్డుపై వేసి జరిమానా చెల్లించడమా తేల్చుకోవాలని అన్నారు.